# వర్ష ప్రభావిత కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్

**నీటిమయమైన కాలనీల్లో ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
**ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం**






**అనంతపురము అర్బన్ మే31: బహుజన వేదిక న్యూస్**

అనంతపురము నగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో నీటిమయమైన కాలనీలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నేడు ఉదయం పరిశీలించారు. నగరంలోని జనశక్తి నగర్, ఎంజీ కాలనీ, రజక నగర్, అశోక్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు.వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల చెట్లు కూలిపోవడంతో ప్రమాదాలు జరగకుండా వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రహదారులపై నిలిచిన వర్షపు నీటిని త్వరితగతిన తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రజక నగర్‌లోని నడిమి వంకలో పేరుకుపోయిన చెత్తను జెసిబిల ద్వారా తొలగించే పనులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరిశీలించారు. డ్రైనేజీలు, వంకలు, కాలువల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగల కారణంగా ప్రజలకు ప్రమాదం కలగకుండా అత్యవసర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్, రూరల్ ఎంపీడీవో, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. వర్షాకాలంలో నగర పారిశుధ్యం, నీటి పారుదల వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి.. అమిలినేని ఎర్రిస్వామి



**విజేతలకు లక్ష రూపాయలు బహుమతిగా అందజేసిన అమిలినేని ఎర్రిస్వామి**

**కంబదూరు మే31: బహుజన వేదిక న్యూస్**

క్రికెట్ పోటీలలో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సోదరుడు అమిలినేని ఎర్రిస్వామి పేర్కొన్నారు..నేడు కంబదూరు మండలం నూతిమడుగు గ్రామంలో జరిగిన క్రికెట్ ఫైనల్ పోటీలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సోదరుడు అమిలినేని ఎర్రిస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ల లక్ష్మీదేవి , కొండాపురం అనిల్ చౌదరి పాల్గొని విజేత నూతిమడుగు జట్టుకు బహుమతిని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఇచ్చిన ఒక లక్ష రూపాయలు, ట్రోఫి బహుమతిగా అందజేశారు, రన్నర్స్ పాళ్లూరు జట్టుకు 50 వేల రూపాయలు ట్రోఫిని అందజేశారు.

## జర్నలిస్టుల శిక్షణా తరగతులు ఉపయోగకరం

**ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు అనుమల వెంకటేశ్వర్లు.**



**కడప, మే 31: బహుజన వేదిక న్యూస్**

కడప జడ్పీ సమావేశ భవనంలో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల గ్రామీణ జర్నలిస్టుల శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగకరంగా సాగాయని ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనమల వెంకటేశ్వర్లు తెలిపారు. జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధికి ఈ శిక్షణ దోహదపడిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌ను పూల బొకేతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.
శిక్షణా తరగతుల్లో న్యూస్ రైటింగ్, ఫోటోగ్రఫీ, వీడియో జర్నలిజం అంశాలపై నిపుణులు వివరించారు. నైతిక విలువలు, చట్టపరమైన అవగాహన వంటి అంశాలపైనా శిక్షణ ఇచ్చి గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు ఈ తరగతులు ఎంతో మేలు చేశాయని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీజేఎఫ్ నాయకులు కోరారు.ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను మరింత మందికి అందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేష్ చేస్తున్న సేవలను జర్నలిజం విలువలు, ప్రమాణాలు పెంచేందుకు అకాడమీ పనిచేస్తోందన్నారు.నేతలు ప్రశంసించారు.
కడప జిల్లా జర్నలిస్టులకు ఇది మంచి అవకాశమని అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఎఫ్ జిల్లా కోశాధికారి సి. వెంకటసుబ్బయ్య, కోఆర్డినేటర్ కె.వి. సుభాష్ కుమార్ పాల్గొన్నారు.

# శ్రీ గూగూడు కుళ్ళాయి స్వామి వారి శతాబ్ది బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం

**నార్పల మే31: బహుజన వేదిక న్యూస్**




నార్పల మండలం గూగూడు గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ గూగూడు కుళ్ళాయి స్వామి దేవస్థానంలో 2026 జూన్ 17 నుండి జూన్ 29 వరకు నిర్వహించనున్న శతాబ్ది బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలో అత్యంత ప్రాచీనమైన మరియు విశిష్టమైన పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీ గూగూడు కుళ్ళాయి స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలు కావడంతో పాటు సుమారు 5 లక్షలకు పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు, పార్కింగ్, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులు మరియు మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు.దేవాలయానికి వెళ్లే రహదారుల మరమ్మతులు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్ల తొలగింపు, బారికేడ్లు, రేడియం సూచిక బోర్డుల ఏర్పాటు, దేవాలయ ప్రాంగణంలో ఇనుప గేట్ల ఏర్పాటు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ & బీ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, తగిన బందోబస్తు కల్పించాలని, మహిళా భక్తుల భద్రత కోసం మహిళా పోలీసులను ప్రత్యేకంగా నియమించాలని సూచించారు. ఆరోగ్య శాఖ ద్వారా 24 గంటల వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని కోరారు.ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు నడపాలని, అగ్నిమాపక శాఖ అగ్నిప్రమాద నివారణ చర్యలు చేపట్టి నీటి ట్యాంకర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే ఆబ్కారీ శాఖ అధికారులు ఉత్సవాల కాలంలో అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా నియంత్రించాలని ఆదేశించారు.భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లు మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్స్, వసతి గదులు, తాగునీటి కేంద్రాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు మైక్‌ల ద్వారా నిరంతరం సూచనలు అందించాలని తెలిపారు. తలనీలాల సమర్పణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దేవాలయ హుండీ కానుకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.శ్రీ గూగూడు కుళ్ళాయి స్వామి వారి వైభవాన్ని చాటిచెప్పే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కోరారు. ఈ సమావేశంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు ,దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీసు, ఆర్ & బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్య, ఆర్టీసీ, ఐసీడీఎస్, అగ్నిమాపక, ఆబ్కారీ శాఖల అధికారులు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, దేవస్థానం అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గొడ్డలి పార్టీకి మెగా డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు



**వైసిపిపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు**
**అర్బన్ టిడిపి కార్యాలయంలో దగ్గుపాటి మీడియా సమావేశం**
**మహానాడు గ్రాండ్ సక్సెస్ అయింది.. జగన్ పిఏ అవినీతి బయటపడింది**
**దీనిని డైవర్ట్ చేయడానికే జగన్ విమర్శలు చేస్తున్నారు**
**వైసిపి అంటేనే అవినీతి, అరాచకం, దౌర్జన్యాలు, హత్యలు**
**పార్టీలో ఎలాంటి విభేదాలు లేవు.. అనవసర విమర్శలు పట్టించుకోను**
**స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచి చూపిస్తాం..**
**ఆ బాధ్యత నాదే..ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురము అర్బన్ మే31: బహుజన వేదిక న్యూస్**

గొడ్డలి పార్టీకి మెగా డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన ఆదివారం రోజు మీడియా సమావేశం నిర్వహించారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని విధంగా మహానాడు కార్యక్రమాన్ని హైబ్రిడ్ విధానంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిందన్నారు. ఇది నారా లోకేష్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా జరిగిన తొలి మహానాడు అని అన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా 1848 క్లస్టర్లలో 24 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. గతంలో నాలుగైదు లక్షల మంది మాత్రమే మహానాడులో పాల్గొనేవారు అని.. అయితే ఇప్పుడు ఏ ప్రాంతంలో వారు ఆ ప్రాంతంలోనే మహానాడులో పాల్గొనే అవకాశం వచ్చిందన్నారు. ఇది దేశంలోనే ఒక రికార్డుగా మిగిలిపోయిందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. మహానాడు వేదికగానే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చట్టసభల్లో తెలుగుదేశం పార్టీ తరఫున 33% రిజర్వేషన్ అమలయ్యేలా చూస్తామని చెప్పారన్నారు. పార్టీ తరఫున కచ్చితంగా 33% టికెట్లు మహిళలకు ఇస్తామని చెప్పడం ఒక గొప్ప నిర్ణయం అని... దీనిపై యావత్ మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. గతంలో ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చి మహిళలకు ఆర్థిక, సామాజిక గౌరవం కల్పించారని వివరించారు. ఇప్పుడు అదే బాటలోనే మంత్రి నారా లోకేష్ మహిళలను ప్రోత్సహిస్తున్నారన్నారు. మహిళా సాధికారత, మహిళా రక్షణే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత వైసిపి ప్రభుత్వం మహిళలకు ఎక్కడ రక్షణ లేకుండా పోయిందని.. అత్యాచారాలు, దాడులు, హత్యలు జరిగాయన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఏపీలోనే ఉన్నాయన్న చెడ్డ పేరు తీసుకొచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయిపై ఉక్కు పాదం మోపారన్నారు. మహిళలపై ఎవరైనా చేయి వేయాలంటే అదే వారికి చివరి రోజు అవుతుందనే విధంగా మహిళలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. కార్యకర్తే అధినేత అన్న సిద్ధాంతం తోనే నారా లోకేష్ పనిచేస్తున్నారని. కోటి సభ్యత్వాలు చేసి దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేనంత బలాన్ని ఇచ్చారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కూడా గతంలో 23వేలు మాత్రమే సభ్యత్వం ఉండేదని.. ఇప్పుడు 80 వేలకు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును చూసి రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని జగన్మోహన్ రెడ్డి కామెంట్ చేశారని.. సిబిఎన్ అంటేనే ఒక బ్రాండ్ అని.. ఆయన వేసిన పునాది ఇవాళ ఉమ్మడి రాష్ట్రంలో సాఫ్ట్వేర్ రంగానికి ఎంత ప్రాధాన్యత లభించిందన్నారు. ప్రతి ఇంట్లో ఒక సాఫ్ట్వేర్, ప్రతి ఊర్లో 20 నుంచి 30 మంది విదేశాల్లో పని చేస్తున్నారన్నారు. 2024 లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి 24 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని.. 20 లక్షల మందికి పైగా ఉద్యోగాలు వచ్చాయన్నారు. అనంతపురం జిల్లా వంటి ప్రాంతంలో కూడా యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. గతంలో కియా పరిశ్రమ వల్ల 50 వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. రాయలసీమకు 30 వేల కోట్ల రూపాయలు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా మార్చబోతున్నట్లు చెప్పారు. పింఛన్లు కూడా దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా ఇస్తున్నారన్నారు. గతంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ప్రజల భూములను కాజేసేందుకు జగన్మోహన్ రెడ్డి పథకం వేసారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ల్యాండ్ టైటిలింగ్ యాక్టింగ్ రద్దు చేసినట్లు చెప్పారు. 2014 నుంచి 19 వరకు తాము చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయామని... ఇప్పుడు ఆ విధంగా కాకుండా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఓవైపు మహానాడు విజయవంతం కావడం అలాగే జగన్ పిఏ అక్రమాల భాగోతం బయటకు రావడంతో ప్రజలను దాని నుంచి డైవర్ట్ చేయడానికి మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ జగన్మోహన్ రెడ్డి ఆరోపణలు చేశారన్నారు. మెగా డీఎస్సీ పూర్తై దాదాపు తొమ్మిది నెలలకు కావస్తోందని... వారికి ఇప్పుడే అక్రమాలు కనిపించాయా అని నిలదీశారు. గత వైసిపి ప్రభుత్వంలో ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద కాపలాగా ఉంచారన్నారు. టాయిలెట్లను ఫోటోలు తీసి పంపేలా ఉపాధ్యాయులను వేధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఒక్క ఉపాధ్యాయ పోస్ట్ కూడా భర్తీ చేయని వారు ఈరోజు తమ ప్రభుత్వం గురించి విమర్శలు చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ అత్యంత పారదర్శకంగా జరిగిందని 16 వేల మందికి పైగా ఉపాధ్యాయ పోస్టులు వచ్చాయన్నారు. విద్యా వ్యవస్థలో కూడా మంత్రి నారా లోకేష్ అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. వైసిపి అంటేనే అవినీతి అరాచకాలు దౌర్జన్యాలు హత్యలు అని అందుకే ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారన్నారు జగన్మోహన్ రెడ్డికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా పులివెందుల ఎమ్మెల్యే గానే కూర్చోబెటారన్నారు. జగన్ ఇలాగే విమర్శలు చేస్తూ ఉంటే భవిష్యత్తులో ఒక్క స్థానం కూడా వచ్చే అవకాశం ఉండదన్నారు....

**స్థానిక సంస్థల్లో అన్ని స్థానాలు గెలుస్తాం... ఆ బాధ్యత నాదే**

ఎక్కడ ఎవరికి ఏ స్థానం కల్పించాలన్నది తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి తెలుసునని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. తనకు గత ఎన్నికల్లో టికెట్ ఇచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే ప్రజలు ఓట్లు వేసింది చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ను చూసి మాత్రమేనన్నారు. తనపై బురదజల్లే వారి గురించి అధిష్టానమే చూసుకుంటుందని నేను అలాంటి వాటి గురించి ఆలోచించనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో నమ్మకంతో తనకు ఈ స్థానం కల్పించారని ఐదేళ్లపాటు అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతోనే ముందుకు వెళ్తానని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీలో ఎక్కడ ఎలాంటి విభేదాలు లేవన్నారు ఎవరైనా కార్యకర్తకు అన్యాయం జరిగితే స్పందించడంలో తానే ముందు ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా సరే పార్టీ లైన్ లోనే ఉండాలని అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అని అన్నారు. 2029 ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని.. అప్పటి పరిస్థితుల గురించి ఇప్పుడు మాట్లాడటం సరైంది కాదన్నారు. అనంతపురం నగరంలో గతంలో 50 డివిజన్లు ఉంటే కనీసం ఒక్కచోట కూడా తెలుగుదేశం పార్టీ గెలిచిన పరిస్థితి లేదన్నారు. కానీ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 62 డివిజన్లలో 4 పంచాయతీల్లో గెలుస్తామని ఆ బాధ్యత కూడా నాదేనని ఆయన తేల్చి చెప్పారు. పార్టీ లైన్ దాటి ఎవరు వ్యవహరించినా అధిష్టానం దాన్ని సీరియస్ గా తీసుకుంటుందని... ప్రస్తుతం అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని.. అనవసర విమర్శలను పట్టించుకోనని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

